# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 20-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- విజయదశమి పండుగను పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.
- సుపరిపాలనతో కూడిన రామరాజ్యాన్ని తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- కేంద్రమంత్రి ఎస్. జైశంకర్ ముంబైలో అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, యూఏఈ విదేశాంగ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్ అల్ నహ్యాన్ లతో త్రైపాక్షిక సమావేశం నిర్వహించారు.
- ఉగ్రవాద నిర్మూలనకు ఐక్యంగా చర్యలు తీసుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ SCO సభ్య దేశాలకు పిలుపునిచ్చారు.

==============================

విజయదశమి పండుగను పురస్కరించుకొని రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు ధర్మబద్ధమైన ప్రవర్తనకు, నైతికతకు నిదర్శనమని, అధర్మం, అన్యాయాలపై ధర్మం, న్యాయం సాధించిన విజయానికి ఈ పండుగ ప్రతీక అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సామాజిక మాధ్యమ పోస్టులో వివరించారు. ఈ పండుగ భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, ఉమ్మడి నాగరికతా విలువలను, భిన్నత్వంలో ఏకత్వం స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఆనందంతో, దృఢ సంకల్పంతో కూడిన విజయదశమి పండుగ, ప్రతి ఒక్కరి లక్ష్యాలకు కొత్త శక్తిని అందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొంటూ.. ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

=================================

ప్రజలకు సేవ చేయడమే రామరాజ్యమని, సత్యం, ధర్మం ఎల్లప్పుడూ అన్యాయాన్ని జయిస్తాయని దసరా పండుగ మనకి గుర్తు చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఢిల్లీలోని ఐపీ ఎక్స్‌టెన్షన్‌లో ఈరోజు జరిగిన దసరా వేడుకల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. శ్రీరాముడు తన జీవితంలో అనేక కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ... ఎల్లప్పుడూ సత్యం, ధర్మం, సూత్రాలకే కట్టుబడి నిలిచారని పేర్కొన్నారు. శ్రీరాముని జీవిత గాథ కరుణ, ప్రేమ, సోదరభావం అనే సందేశాలను అందిస్తుందని చెప్పారు. దేశం `వికసిత్ భారత్` లక్ష్యం వైపు పయనిస్తున్న తరుణంలో... సుపరిపాలనతో కూడిన `రామరాజ్యాన్ని` తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. దేశ దీర్ఘకాలిక పురోగతికి జాతీయ ఐక్యత అత్యంత కీలకమని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకెన్లు)

=================================

ప్రపంచ ప్రతికూలతలు, ప్రాంతీయ సవాళ్లు ఉన్నప్పటికీ భారత్ - యుఏఈ దేశాల ఆర్థిక భాగస్వామ్యం కొత్త ప్రమాణాలను నెలకొల్పుతూనే ఉందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. ముంబైలో ఆయన ఈరోజు యూఏఈ ఉప ప్రధాని షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ... ఒకరి ఆర్థిక వ్యవస్థలపై మరొకరికి ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తూ, ఇరువైపులా పెట్టుబడులు పెరుగుతూనే ఉన్నాయని చెప్పారు. రక్షణ, ఇంధన, సాంకేతిక రంగాలలో సహకారం.. వ్యూహాత్మక రూపాన్ని సంతరించుకుంటోందని, ప్రజల మధ్య సంబంధాలు ఇరు సమాజాల జీవితాలను సుసంపన్నం చేస్తూనే ఉన్నాయని వివరించారు. సీఈపీఏపై సంతకం చేసినప్పటి నుండి ద్వైపాక్షిక వాణిజ్యం 100 బిలియన్ డాలర్ల మార్కును దాటిందని కేంద్రమంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. కాగా జైశంకర్ ఈరోజు ముంబైలో యూఏఈ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్ అల్ నహ్యాన్, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోలతో త్రైపాక్షిక సమావేశం నిర్వహించారు.

=================================

భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA) ఈరోజు నుండి అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం దేశ ఎగుమతిదారులకు నూతన అవకాశాలను కల్పిస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. FTAపై న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఈ ఒప్పందం `వికసిత్ భారత్ 2047` దార్శనికతకు అనుగుణంగా ఉందని పేర్కొన్నారు. దీని ద్వారా ఎంఎస్ఎంఈలు, చేతివృత్తుల వారు, రైతులు, ఫార్మా రంగానికి వాణిజ్య అవకాశాలు గణనీయంగా పెరుగుతాయన్నారు. 2030 సంవత్సరం నాటికి న్యూజిలాండ్‌తో వస్తు సేవల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సుమారు 35 వేల కోట్ల రూపాయలకు పెంచే దిశగా కలిసి పని చేయడానికి ఇరు దేశాలు అంగీకరించాయని మంత్రి తెలిపారు. FTA ఒప్పందం.. ఉత్పాదకతను మెరుగుపరచడానికి, జీవనోపాధిని బలోపేతం చేయడానికి సహాయపడుతుందన్న కేంద్ర మంత్రి.. తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, పాడి పరిశ్రమతో సహా పలు సున్నితమైన రంగాలకు రక్షణ కల్పిస్తోందని తెలియజేశారు.

విరామం

=================================

ఉగ్రవాద వ్యవస్థ నిర్మూలనకు ఐక్యంగా చర్యలు తీసుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. తజికిస్తాన్‌లోని దుషాన్బేలో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (SCO) ప్రభుత్వాధినేతల మండలి 25వ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉగ్రవాదానికి ఎలాంటి సమర్థన ఉండకూడదని, దానిని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు అవలంబించకూడదని రక్షణ మంత్రి ఉద్ఘాటించారు. ఉగ్రవాదులకు ఆర్థిక సహాయం చేసేవారికి, ఆశ్రయాలు కల్పించే వారికి చోటు లేదని స్పష్టం చేశారు. ఆర్థిక సంబంధాలు అన్ని సభ్య దేశాలకు పరస్పర

ప్రయోజనకరంగా ఉండాలన్నదే భారతదేశ ఉద్దేశ్యమన్నారు. సార్వభౌమ సమానత్వం, ఏకాభిప్రాయం, పరస్పర గౌరవం అనే సూత్రాలకు కట్టుబడి ఉండటంలో SCO సమర్థవంతంగాను, స్థిరంగా ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్యం, సరఫరా గొలుసులకు అంతరాయాలు వంటి వాటి పరిష్కారానికి SCO అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

================================

భారతదేశం తమకు ఒక ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి అని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో వ్యాఖ్యానించారు. భారత్ పర్యటనలో ఉన్న ఆయన ఈరోజు ముంబైలో పాత్రికేయులతో మాట్లాడుతూ... భారత్ ఒక బలమైన వ్యూహాత్మక భాగస్వామి అని, అలాగే క్వాడ్‌లో కీలక సభ్యదేశమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్.. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పారు. భారతదేశానికి భారీ ముడి చమురును శుద్ధి చేసే సామర్థ్యం ఉందని చెప్పారు. కాగా.. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, మార్కో రూబియోతో ఈరోజు ముంబైలో చర్చలు జరిపారు. వాణిజ్యం, ఇంధనం, సాంకేతికత, రక్షణ, ప్రజల మధ్య సంబంధాలపై దృష్టి సారిస్తూ భారత్-అమెరికా సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై వారు చర్చించారు. ప్రాంతీయ పరిణామాలపై కూడా తాము అభిప్రాయాలను పంచుకున్నామని జైశంకర్ సామాజిక మాధ్యమ పోస్ట్‌లో తెలిపారు.

================================

అణు నిరాయుధీకరణకు భారతదేశం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు మనీష్ తివారీ ఉద్ఘాటించారు. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం మొదటి కమిటీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. అణ్వాయుధాలను మొదటగా ఉపయోగించకపోవడం, అణ్వాయుధాలు లేని దేశాలపై వాటిని ఉపయోగించకపోవడం అనేవి భారతదేశ విధానాలని స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతిక సవాళ్ల గురించి మాట్లాడుతూ.. అణ్వాయుధాల వాడకంపై నిర్ణయాలు మానవ నియంత్రణలోనే ఉండాలన్నారు. కమాండ్, నియంత్రణ వ్యవస్థలలో కృత్రిమ మేధస్సును అనుసంధానించడంపై ఉన్న ఆందోళనలను ప్రధానంగా ప్రస్తావించిన మనీష్ తివారీ.. అణు ప్రమాదాన్ని తగ్గించేందుకు భారత్ చాలా కాలంగా చేస్తున్న ప్రతిపాదనలను వివరించారు.

================================

భారత నౌకాదళానికి నాణ్యమైన స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకమని నౌకాదళ వైస్ చీఫ్.. వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చర్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `భారత నౌకాదళ స్వదేశీకరణ సెమినార్, స్వావలంబన్-2026` 5వ ఎడిషన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన పత్రికా సమావేశంలో మాట్లాడారు. యుద్ధ సన్నద్ధత, కార్యాచరణ సౌలభ్యం, సామర్థ్య పెంపు కోసం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం అవసరమని పేర్కొన్నారు. ఆధునిక యుద్ధ స్వరూపం మారుతున్న తీరు దృష్ట్యా ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాలను సముద్రంలో మోహరించగల వ్యవస్థలుగా అభివృద్ధి చేయాల్సి ఉందని వ్యాఖ్యానించారు. 2022 నుండి స్వావలంబన్ పరిణామం ద్వారా భారత నౌకాదళ కార్యాచరణ అవసరాలకు, భారత పరిశ్రమ, విద్యా సంస్థల సాంకేతిక సామర్థ్యాలకు మధ్య అనుసంధానం జరిగిందన్నారు.

================================

జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న ఆసియా పారా క్రీడల్లో మహిళల 200 మీటర్ల టీ-12 ఫైనల్‌లో సిమ్రాన్ 24.80 సెకన్ల సమయంతో స్వర్ణపతకం కైవసం చేసుకుంది. ఇదే ఈవెంట్‌లో తేజల్‌బెన్ దామోర్ 25.23 సెకన్లతో కాంస్యం సాధించింది.

================================
================================